# JUDGEMENT

PRESENT:
Hon'ble Mr. Justce Swatanter Kumar (Chairperson)
Hon'ble Mr. Justice U.D.Salvi (Judicial Member)
Hon'ble Mr. Bikram Singh Sajwan (Expert Member)
Hon'ble Dr. Ajay Deshpande (Expert Member)

---

Reserved on : 25th October, 2016
Pronounced on : 22nd December, 2016

---

కావున, ఈ నియమాలలో ఏర్పడిన ఖాళీని భర్తీ చేసే విధంగా కూడా, 2016 సంవత్సరపు నియమాలు ప్రభావవంతంగాను మరియు ఖచ్చితంగాను అమలు చేయబడు నిమిత్తమై సమగ్రమైన నిర్దేశాలను జారీ చేయవలసిన ఆవశ్యకత ఈ ట్రిబ్యునల్‌కు ఏర్పడినది. ఆవిధంగా, పర్యావరణము మరియు ప్రజా ఆరోగ్యం దృష్ట్యా, మేము ఈ క్రింద పేర్కొనబడిన నిర్దేశములను జారీ చేస్తున్నాము:

1. ప్రతి రాష్ట్రము మరియు కేంద్రపాలిత ప్రాంతము కూడ, అన్ని అంశాలలోనూ మరియు ఇంకెంతమాత్రము జాప్యం చేయకుండ 2016 సంవత్సరపు ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలను (సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్, 2016) అమలు చేయాలి.

2. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలు ఈ తీర్పు ప్రకటించబడిన తేది మొదలుకొని నాలుగు వారాల లోపుగా 2016 సంవత్సరపు నియమాలు మరియు ఈ తీర్పులోని నిర్ధేశముల ప్రాతిపదికన ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించవలెను. ఇట్టి కార్యచరణ ప్రణాళిక అనునది మొత్తం రాష్ట్రంలోని వ్యర్థాల నిర్వహణ మరియు నిర్మూలనకు సంబంధించినదై ఉండవలెను. చర్యలు ఒక నిర్దిష్టమైన కాల వ్యవధిలోపుగా చేపట్టవలసి ఉండును. 2016 సంవత్సరపు నియమాలకు అనుగుణంగా, ప్రాసెసింగ్ మరియు వ్యర్థాల నిర్మూలన నిమిత్తమై సంస్థల స్థాపన వాటి నిర్వహణ మరియు నిర్మాణము చేయవలసి ఉన్నటువంటి ల్యాండ్ ఫిల్ ప్రదేశముల ఎంపిక మరియు ప్రమాణములు రూపొందించి ఖచ్చితంగా అమలు చేయబడవలెను.

3. 2016 సవత్సరపు నియమాల నందలి 6(బి), 15 నియమాల ప్రకారం విధించబడిన ఆరు మాసాల కాలము ఇప్పటికే ముగిసినది. దాని ప్రకారం నిర్దిష్టమైన కాల వ్యవధి లోపుగా రాష్ట్ర ప్రభుత్వములు చర్యలు చేపట్టలేకపోయాయి. చివరి అవకాశంగా అట్టి ఆరు మాసాల వ్యవధి 2017 సంవత్సరం జనవరి నెల 1వ తేది నుండి మొదలైనట్లుగా భావించబడుతుంది. ఆ తదుపరి ఈ నిబంధనల అమలుకు ఏ రాష్ట్రమునకు కూడా గడువు పొడిగింపు ఉండదు. కాబట్టి, రూపొందించబడిన ప్రణాళికలు మరియు కమిటీలచే జారీ చేయబడు నిర్దేశముల అమలుకు సంబంధించి 11(ఎ), 11(ఎఫ్), 15(ఇ) మరియు 22 నియమాల క్రింద విధించబడిన ఒక సంవత్సరము గడువు అనునది 2017 సంవత్సరం జూలై నెల 1వ తేదీ నుండి ఆరంభం అవుతుంది. దీనికి సంబంధించి కూడా పొడగింపు ఏమీ ఉండదు.

ఇకమీదట ఏ రాష్ట్రము గాని లేదా కేంద్రపాలిత ప్రాంతము గాని, పైన పేర్కొనబడినట్లుగా చట్టబద్ధమైన బాధ్యతలను గనుక అమలు చేయకపోయినట్లైతే, అట్టి రాష్ట్రము లేదా కేంద్రపాలిత ప్రాంతముపై 1986 సంవత్సరపు పర్యావరణ (పరిరక్షణ) చట్టము నందలి 15వ సెక్షన్ ప్రకారం చర్యలు తీసుకోబడతాయి. అంతేకాకుండా, అట్టి రాష్ట్రము లేదా కేంద్రపాలిత ప్రాంతము, ఈ ట్రిబ్యునల్‌చే విధించబడు, పర్యావరణ నష్టపరిహారమును కూడా చెల్లించవలసి ఉంటుంది. దీనికి అదనంగా, ఈ ట్రిబ్యునల్‌చే జారీ చేయబడిన నియమాలు మరియు ఉత్తర్వుల ఉల్లంఘునకు గాను రాష్ట్ర ప్రభుత్వము / పట్టణ ప్రాంత స్థానికసంస్థ యొక్క సీనియర్ మోస్ట్ ఆఫీసర్-ఇన్-చార్జ్‌పై వ్యక్తిగతంగా కూడా చర్యలు తీసుకోవటం జరుగుతుంది.

4. ఇకమీదట, ఇంకెంత మాత్రము జాప్యం చేయకుండా లేదా అభ్యంతరాలను లేవనెత్తకుండా, కేంద్ర ప్రభుత్వము రాష్ట్ర ప్రభుత్వము, స్థానిక సంస్థలు మరియు పౌరులు, 2016 సంవత్సరపు నియమాల ప్రకారం విధించబడిన మేరకు తమ తమ బాధ్యతలను / విధులను నిర్వర్తించవలెను.

5. అన్ని రాష్ట్ర ప్రభుత్వములు, వాటి యొక్క శాఖలు మరియు స్థానిక అధికారులు ఒకరితో మరొకరు పూర్తి సమన్వయము మరియు సహకారంతో వ్యవహరించి రాష్ట్రములో ఉత్పన్నమయ్యే ఘనవ్యర్థాలను ఖచ్చితంగా, 2016 సంవత్సరపు నియమాలకు అనుగుణంగా నిర్వహణ చేశాక నిర్మూలన చేయబడు విధంగా తగిన జాగ్రత్తలను తీసుకొనవలెను.

6. ఎక్కడైతే వ్యర్థాల నిర్మూలన నిమిత్తమై వ్యర్థాల నుండి విద్యుత్తు ఉత్పత్తి చేయు ప్లాంటు స్థాపించబడుతుందో అట్టిచోట, వ్యర్థాల పరిమాణమునకు సంబంధించి నిర్మూలన గావించటానికి పూర్వము వ్యర్థాలను సక్రమంగా వేరుచేయుటం తప్పనిసరిగా చేపట్టవలెను.

7. భౌగోళికంగా అవి ఒకేచోట ఉన్నా లేదా వేరువేరుగా ఉన్నా కూడా ప్లాంటులు మరియు ల్యాండ్ ఫిల్ సైట్‌ల చుట్టూ ఒక బఫర్‌జోన్‌ను ఏర్పాటు చేయుటం తప్పనిసరి. భూమి కొరత ఉన్న ప్రదేశాలలో అట్టి బఫర్‌జోన్ అనునది ఖచ్చితంగా 500 మీటర్లు ఉండవలసిన అవసరం లేదు. కాలుష్యాన్ని నియంత్రించటంతో పాటుగా, ప్రాజెక్టు యొక్క ప్రదేశము ఉద్యానవనం రూపంలో సుందరీకరణ చేస్తూ, ఒక హరితహారం కార్యక్రమము ద్వారా ప్లాంటు ఆవరణమును పరిసరాలనుండి వేరు చేయుటం అనునది బఫర్‌జోన్ యొక్క ప్రయోజనముగా ఉండవలెను. ఇది సంబంధిత అధికారులచే నిర్ధారించబడవలెను మరియు బఫర్‌జోన్ విస్తీర్ణమునకు సంబంధించి నియమాలలో ఏమీ పేర్కొనబడలేదు. ఏది ఏమైనప్పటికీ, దానికి కావలసిన విధి విధానములను అర్బన్ డెవలప్‌మెంట్ మాన్యువల్ కల్పిస్తున్నది. కావున, ఈ నిబంధన సూచన మాత్రమే తప్ప తప్పనిసరి కాదు అని మేము ప్రకటిస్తున్నాము.

బఫర్‌జోన్ మరియు హరిత హారము ఆవశ్యకమైనవని మరియు వాటి యొక్క విస్తీర్ణము అనునది వ్యక్తిగతంగా ఏ కేసుకు ఆకేసును బట్టి నిర్ధారించవలెను అని మేము స్పష్టం చేస్తున్నాము.

8. నియమము 5 మేరకు నెలకొల్పబడిన కమిటీలు ప్రతి మూడు మాసములకు ఒక పర్యాయము సమావేశం కావాలే తప్ప సంవత్సరానికి ఒక పర్యాయము కాదు అని మేము స్పష్టం చేస్తున్నాము. సమావేశ తీర్మానములు ప్రజాబాహుళ్యము నందు ప్రదర్శించబడవలయును. తీర్మానముల ప్రతిపాదికన ఇచ్చే ఆదేశాలు అట్టి సమావేశము ముగిసిన వెనువెంటనే సంబంధిత రాష్ట్రాలు, స్థానిక సంస్థలు, శాఖలు మరియు ప్రాజెక్టు ప్రతిపాదకులకు జారీ చేయవలెను.

9. వ్యర్థాల నిర్వహణ ప్లాంటుకు 100 కి.మీ. పరిధిలో ఉన్న విద్యుత్తు ఉత్పాదన మరియు సిమెంట్ ప్లాంటులు ఇంధనం నిమిత్తమై ఆర్.డి.ఎఫ్. ను ఖరీదు చేసి ఉపయోగించటాన్ని తప్పనిసరి చేస్తూ సంబంధితులందరికీ రాష్ట్ర ప్రభుత్వము స్థానిక సంస్థలు ఆదేశాలు జారీ చేయవలయును.

   మరొక రకంగా చెప్పాలంటే, ఆర్.డి.ఎఫ్. వినియోగము నిమిత్తమై ఒక విపణిని సృష్టించటం అనునది రాష్ట్రము, స్థానిక సంస్థల బాధ్యత. అందుచేత, వ్యర్థాల నుండి విద్యుత్తు ఉత్పాదన చేయు ప్లాంటులలో కూడా వ్యర్థాలు - ఆర్.డి.ఎఫ్. - విద్యుత్తు విధానమునకు ప్రాధాన్యతనివ్వవలెను.

10. నేరుగా ఇన్సినరేషన్ (నిర్మూలన) ద్వారా వ్యర్థాల నుండి విద్యుత్తును ఉత్పత్తి చేయు ప్లాంటులో, వ్యర్థాలను వేరు చేయుట అనునది తప్పనిసరి మరియు కాంట్రాక్టు యొక్క నియమ నిబంధనలు మరియు షరతులతో భాగమై ఉండవలెను.

11. సదుపాయము యొక్క కన్సెషనేయర్ / ఆపరేటర్‌కు చెల్లించబడవలసిన టిప్పింగ్ రుసుము అనునది కేవలం అట్టి కన్సెషనేయర్ / ఆపరేటర్‌కు సరఫరా చేయబడు వ్యర్థాల పరిమాణమునకు మాత్రమే కాకుండా, ప్లాంటు సమర్థవంతముగాను మరియు క్రమం తప్పకుండా పనిచేయుటానికి కూడా సంబంధించిన అంశము అవుతుంది. వ్యర్థాల లోడ్‌కి సంబంధించిన టిప్పింగ్ రుసుము సందర్భములో సంబంధిత శాఖలు మరియు స్థానిక సంస్థల యొక్క ఆన్‌లైన్ సిస్టమునకు కంప్యుటరైజ్డ్ వేయింగ్ యంత్రాలను అనుసంధానించుట తప్పనిసరి చేయవలెను.

12. వ్యర్థాల సదుపాయము యొక్క కన్సెషనేయర్ / ఆపరేటర్ తనకు తానుగా సేకరించవలసిన సందర్భంలో, సోర్సు / కలెక్షన్‌పాయింట్ వద్దనే నిష్క్రియమైన మరియు సి అండ్ డి వ్యర్థాలను వేరు చేసి నియమాలకు అనుగుణంగా అట్టి వ్యర్థాలను గుర్తించబడిన ప్రాంతాలకు రవాణా చేయుట అనునది అట్టి వ్యక్తి యొక్క బాధ్యతగా ఉండవలెను.

13. ల్యాండ్ ఫిల్ సైట్‌లు, ఉత్తర్వును ప్రకటించిన తేదీ నుండి మొదలుకొని ఆరు మాసముల లోపుగా జీవపరంగా స్థిరీకరణ (బయో-స్టెబిలైజేషన్) చేయువలెను. విండ్ రోస్‌ను క్రమం తప్పకుండా మళ్లించవలెను. ల్యాండ్ ఫిల్ సైట్‌ల వద్ద, మురుగు ఏర్పడకుండాను మరియు మిథేన్ ఉత్పన్నం కాకుండా తగు జాగ్రత్త చర్యలను చేపట్టవలెను. స్థిరీకరింబడిన వ్యర్థాలను కంపోస్టింగ్ చేసి తదనంతరం దానిని ఆర్గానిక్ ఎరువుగా ఉపయోగించవలెను.

14. ల్యాండ్ ఫిల్‌లో ముఖ్యంగా కేవలం నిష్క్రియమైన వ్యర్థాలను మరియు రిజెక్ట్‌లను మాత్రమే నిక్షేపంచేయువలెను. ఏది ఏమైనప్పటికి, ఒకవేళ అధికారులు గనుక సమర్థ మైన మరియు చెల్లుబాటు కాగల కారణాల కొరకు ల్యాండ్‌ఫిల్‌ను ఉపయోగించవలసి వచ్చినట్లయితే, అటువంటి ల్యాండ్ ఫిల్‌ల వద్ద నిక్షేపం చేయు వ్యర్థాలను (నిష్క్రియమైనవి కాకుండ)వేరు చేసి, నిబంధన 12 ప్రకారం హ్యాండిల్ చేయువలెను.

15. జీవఅధోకరణ చెందని (నాన్-బయోడిగ్రేడబుల్) వ్యర్థాలు మరియు పునర్వినియోగం చేయుటకు వీలులేని ప్లాస్టిక్‌ను ల్యాండ్ ఫిల్ సైట్‌ల నుండి వేరు చేసి, దేశం అంతటా అన్ని రోడ్డు ప్రాజెక్టులలోనూ రహదారుల నిర్మాణము కొరకు మరియు గట్ల కొరకు ఉపయోగించవలయును. ఈ మేరకు, సదుపాయం యొక్క కన్సెషనేయర్ / ఆపరేటర్‌కు పనిని అవార్డు చేయు కాంట్రాక్టులో నిర్దిష్టముగా ఒక నిబంధనను చేర్చవలెను.

16. ఫ్లూరోసెంట్ ట్యూబ్‌లు, బల్బులు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, సిరెంజ్, గడువు ముగిసిన మందులు మరియు తత్సంబంధిత ఇతర వస్తువులు వంటి గృహ సంబంధమైన హానికారక వ్యర్థాలను సేకరించుటకు లేదా అటువంటి వాటిని ఆయా ప్రాంతాల ప్రజలు డిపాజిట్ చేయుటకు వీలు కల్పిస్తూ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోని ప్రతి కాలనీలోనూ తగినంత సంఖ్యలో కేంద్రాలను ఏర్పాటు చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వము, స్థానిక సంస్థలు, సంబంధిత రాష్ట్రాల కాలుష్య నియంత్రణ మండలులు, కేంద్రపాలిత ప్రాంతాల కాలుష్య నియంత్రణ కమిటీలు విస్తరించబడిన ఉత్పత్తిదారుని బాధ్యతలను నిర్వర్తించటమో లేదా నిర్వర్తింపచేయుటమో చేయాలి. ఆవిధంగా ఆయా కేంద్రాలచే సేకరించబడు హానికారక వ్యర్థాలను సాధ్యమైన చోట్ల పునర్వినియోగానికి పంపాలి. వాటిలో మిగిలిన వాటిని హానికారక వ్యర్థాల డిస్పోజల్ ఫ్యాక్టరీకి రవాణా చేయవలెను.

17. స్వల్పకాలిక మన్నిక కలిగిన పి.వి.సి. ని మరియు క్లోరినేటెడ్ ప్లాస్టిక్‌లను, బహిష్కరించుటకు సంబంధించి, వీలైనంత త్వరలో, అయితే ఎటువంటి సందర్భములోను ఈతీర్పు ప్రకటింపబడిన తేదీ మొదలుకొని ఆరు మాసాల వ్యవధికి మించకుండా తగిన ఆదేశాలను జారీ చేయువలసినదిగా పర్యావరణము, అడవులు మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వారిని మరియు రాష్ట్ర ప్రభుత్వాలను మేము ఆదేశిస్తున్నాము.

18. ఈ తీర్పులో జారీ చేయుబడిన నిర్దేశాలు మరియు ఉత్తర్వులు ప్రస్తుతం ఉనికిలో ఉన్న ఏవేని కాంట్రాక్ట్‌లపై ఎటువంటి ప్రభావం చూపవు, ఏది ఏమైనప్పటికి, వ్యర్థాల నిర్వహణ మరియు నిర్మూలన సంబంధించి కాంట్రాక్టు యొక్క పార్టీలను, పరస్పర అంగీకారం ద్వారా, తమ ప్రదర్శనను మరియు హక్కులు బాధ్యతలను ట్రిబ్యునల్ యొక్క ఈ తీర్పు మరియు 2016 సంవత్సరపు నియమావళికి అనుగుణంగా తీసుకురావలసినదిగా మేము ఇప్పటికీ ఆదేశిస్తున్నాము. ఏది ఏమైనప్పటికి, ఇంకనూ ప్రక్రియ దశలో ఉన్న సదుపాయము యొక్క యావన్మంది కన్సెషనేయర్లు /

ఆపరేటర్లకు ఈ తీర్పు మరియు 2016 సంవత్సరపు నియమావళి పూర్తిగాను మరియు సమగ్రముగాను వర్తిస్తుంది.

19. ల్యాండ్ ఫిల్ సైట్‌లతో సహా భూములపై వ్యర్థాలను బహిరంగంగా మండించటం పూర్తి నిషేదము ఉండాలని మేము నిర్దిష్టముగా ఆదేశిస్తున్నాము. అటువంటి ప్రతి తప్పిదానికి, ఉల్లంఘించిన వ్యక్తులు, ప్రాజెక్టు ప్రతిపాదకులు, కన్సెషనేయర్లు, యు.ఎల్.బి. తోసహా, అట్టి విధముగా మండించుటకు బాధ్యులైన ప్రతి వ్యక్తి కూడా కొద్దిపాటి మండింపు సందర్భములో అయితే రూ.5,000/- (అక్షరాల ఐదు వేల రూపాయలు మాత్రమే) మరియు ఆవిధంగా మండించటం అనునది భారీగా చేసినట్లైతే రూ.25,000/- (అక్షరాల ఇరవై ఐదు వేల రూపాయలు మాత్రమే) పర్యావరణ నష్టపరిహారముగా చెల్లించవలసి ఉంటుంది. పర్యావరణ నష్టపరిహారమును చట్టము ప్రకారం తత్సంబంధిత ఆథారిటీ వారిచే భూమి శిస్తు బకాయిల మాదిరిగా వసూలు చేయబడవలెను.

20. అన్ని స్థానిక సంస్థలు, కన్సెషనేయర్, సదుపాయం యొక్క ఆపరేటర్లు తమ యొక్క ప్లాంటు పనితీరుకు సంబంధించిన మరియు అది నిర్ధిష్టపరచబడిన ప్రాతిపదికలకు కట్టుబడి ఉంటూ ఉన్న వివరాలను తమ తమ వెబ్‌సైట్‌లపై ప్రదర్శించు బాధ్యత కలిగి ఉండవలెను. ఈ వివరాలన్నీ ప్రజాబాహుళ్యములో ప్రదర్శించబడవలెను మరియు ఒకవేళ ప్లాంటు గనుక నిర్ధిష్టమైన ప్రాతిపదిక ప్రకారం నిర్వహించబడకుండా ఉన్నట్లైతే అందుకు సంబంధించి ఎవరైనా సరే అథారిటీ వారిని సంప్రదించుటకు అధికారము కలదు.

21. అటువంటి మండించు సంఘటనలను పర్యవేక్షించటం ద్వారా సర్వే మరియు పరిశోధన చేసి, అటువంటి అక్రమ మరియు అనధీకృత వ్యర్థాల నిర్మూలన కారణంగా ఏ రకమైన కాలుష్యాలు బహిర్గతం అయ్యాయో అట్టి వివరాలతో కూడిన నివేదికను ట్రిబ్యునల్‌కు సమర్పించవలసినదిగా సి.పి.సి.బి. మరియు సంబందిత రాష్ట్రి మండలులను మేము ఆదేశిస్తున్నాము.

22. "కుద్రత్ సంధు వర్సెస్ ఎన్.సి.టి. ప్రభుత్వము మరియు ఇతరులు" అన్న ఓ.ఎ.నం.281 ఆఫ్ 2016 లో ఈ ట్రిబ్యునల్‌చే జారీ చేయబడిన తీర్పులో పేర్కొనబడిన నిర్దేశములు ఈ తీర్పునకు "ముట్యాటిస్ మ్యుటాండిస్" గా వర్తిస్తాయి మరియు ఫలస్వరూపంగా మొత్తం దేశం అంతటా ఉన్న యావన్మంది బాధ్యులకు వర్తిస్తాయి.

23. దేశం అంతటా కూడా 2016 సంవత్సరపు నియమావళిని మరియు ఈ తీర్పులో పేర్కొనబడిన నిర్దేశాలను అమలు చేయుటలో విఫలం అయ్యే ఏదేని రాష్ట్రము / కేంద్రపాలిత ప్రాంతము, స్థానిక సంస్థలు, కన్వేషనేయర్లు, సదుపాయాల ఆపరేటర్లు లేదా ఎవరేని స్టేక్‌హోల్డర్, వ్యర్థాల ఉత్పత్తిదారులు లేదా ఎవరేని వ్యక్తి, 1986వ సంవత్సరపు పర్యావరణ (పరిరక్షణ) చట్టము నందలి 15వ సెక్షన్ ప్రకారం పీనల్ చర్యకు మరియు ట్రిబ్యునల్‌చే నిర్ధారించబడు మేరకు 2010 సంవత్సరపు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చట్టమునందలి 15 మరియు 17వ సెక్షన్స్ ప్రకారం పర్యావరణ నష్టపరిహారము చెల్లింపునకు బాధ్యులు అవుతారు.

24. అందుబాటులో ఉన్న సదుపాయాల గురించి, వ్యర్థాల నిర్వహణ గురించి మరియు నియమాలు మరియు ఈ తీర్పు ప్రకారం జనబాహుళ్యము యొక్క, పబ్లిక్ అథారిటీల యొక్క, కన్వేషనేయర్స్ యొక్క మరియు సదుపాయం ఆపరేటర్ల యొక్క బాధ్యతల గురించి ప్రజలలో అవగాహనను తీసుకువచ్చుటకై అన్ని చర్యలను రాష్ట్ర ప్రభుత్వము / కేంద్ర పాలిత ప్రాంతము, పబ్లిక్ అథారిటీలు, కన్వేషనేయర్లు / ఆపరేటర్లు చేపట్ట వలెను. అట్టి ప్రయోజనం నిమిత్తమై ప్రజా అవగాహన కార్యక్రమాలను వారు క్రమం తప్పకుండా నిర్వహించాలి. ఈకార్యక్రమము సంబంధిత రాష్ట్రములు / కేంద్ర పాలిత ప్రాంతములు / జిల్లాలలోని స్థానిక భాషలలో నిర్వహించవలెను.

25. నియమాలు కేవలం ల్యాండ్ ఫిల్ సైట్‌కు మాత్రమే తప్ప డంపింగ్ సైట్‌కు వర్తించవు అన్న వాస్తవాన్ని జ్ఞప్తియుందుంచుకొంటూ ఈ దిశగా సక్రమమైన చర్యలను సంబంధిత అధికారులు తీసుకోవాలని మేము ఆశిస్తున్నాము.

26. ఈ తీర్పులోని ఆదేశాలను మరియు 2016 సంవత్సరపు నియమావళిలో పేర్కొనబడిన బాధ్యతలను స్థానిక భాషలలో ముద్రించి పంపిణీ చేయాలని కూడా మేము ఆదేశిస్తున్నాము.

27. రాష్ట్రములోని ప్రతి సలహా సంఘం, ఈ నిర్దేశాలను మరియు 2016 సంవత్సరపు నియమావళిని సక్రమంగా అమలు చేయు నిమిత్తమై మానిటరింగ్ (పర్యవేక్షణ) కమిటీగా కూడా వ్యవహరించవలెను.

28. ఈతీర్పు యొక్క ప్రతిని యావన్మంది ప్రధాన కార్యదర్శులు / రాష్ట్రాల / కేంద్రపాలిత ప్రాంతాల సలహాదారులకు ట్రిబ్యునల్ యొక్క రిజిష్ట్రి ద్వారా సర్క్యులేట్ చేయవలెను. ఈ తీర్పులో పేర్కొనబడిన ఆదేశాలను అమలు చేయుటకై వెనువెంటనే చర్యలను చేపట్టి, వారికి ఈతీర్పు ప్రతి ముట్టిన తేదీ మొదలుకొని ఒక మాసములోపుగా దీనిపై చర్యా నివేదికను ట్రిబ్యునల్‌కు దాఖలు చేయవలసినదిగా అట్టి అధికారులను మేము ఇందుమూలముగా ఆదేశిస్తున్నాము.

29. పై ఆదేశాలతో, ఈ అప్లికేషన్ మరియు అన్ని ఇతర మిసిలేనియస్ అప్లికేషన్లు, ఖర్చులకు సంబంధించి ఎటువంటి ఉత్తర్వులు లేకుండా ముగించడమైనది.

స్వతంత్ర్ కుమార్
చైర్‌పర్సన్

యు.డి. సాల్వి
జుడీషియల్ మెంబర్

బిక్రమ్ సింగ్ సాజ్వాన్
ఎక్స్‌పర్ట్ మెంబర్

అజయ్ దేశ్‌పాండే
ఎక్స్‌పర్ట్ మెంబర్

కొత్త ఢిల్లీ,
22 డిసెంబర్, 2016.